క్లుప్తంగా

ఏటీసీ విధానాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆటో, ఇతర వాహనాల ఎఫ్‌సీలను ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల నుంచి తీసుకోవాలన్న విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పాతబస్టాండ్‌లో ఏటీసీ సెంటర్ల ఏర్పాటును నిరసిస్తూ ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటీసీలను ప్రైవేట్‌కు అప్పగించడం ద్వారా ఆటో యాజమానులపై విపరీతమైన భారం పడుతుందన్నారు. ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. నాయకులు బి.రాధాకృష్ణ, హుసేన్‌వలి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఆదోనిలో ఫిబ్రవరి 15వ తేదీన జరిగే ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కర్నూలు జిల్లా విద్యాపరంగా వెనుకబడి ఉన్నా ప్రతిష్టాత్మకమైన సంస్థలను స్థాపించడంలో విఫలమయ్యాయన్నారు. ఆదోనిలో వెంటనే మెడికల్ కాలేజీని ప్రారంభించాలని, ప్రతి మండల కేంద్రంలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన హాస్టళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసులు, సాయి, ఉదయ్, రవి పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక



జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు: నగర శివారులోని లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు పాఠశాల సీఈఓ గోపీనాథ్ సోమవారం తెలిపారు. పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులు రీతు సింధు, షెర్లిన్ సంజీవ్ రీజనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో మొదటి బహుమతి సాధించారన్నారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులు దెబోరా, దేవప్రియారాజీను, ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

మార్కెట్లోకి కియా సైరోస్ కారు




కియా సైరోస్ కారును ఆవిష్కరిస్తున్న ఎంజీ బ్రదర్స్ సీఈఓ ఆదిత్య మాచానీ

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఎం.జి.బ్రదర్స్ కియా షోరూంలో సోమవారం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో కియా సైరోస్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంజీ బ్రదర్స్ సీఈఓ ఆదిత్య మాచాని మాట్లాడుతూ.. కియా సైరోస్ కారు పెట్రోల్, డీజిల్, మాన్యువల్, ఆటోమాటిక్ వేరియంట్లలో 8 ఆకర్షణీయమైన రంగుల్లో లభిస్తుందన్నారు. 30 డిస్‌ప్లే స్లైడింగ్‌తో రిక్‌లైయినర్ మోడల్‌లో వెనుక సీట్, స్ట్రీట్ లైన్ డోర్ హ్యాండిల్స్, ఓటీఏ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వంటి ఫీచర్లతో ఉందన్నారు. ఎక్స్ షోరూమ్ ధరను వచ్చే నెల 1వ తేదీన ప్రకటించనున్నట్లు చెప్పారు. ఎంజీ బ్రదర్స్ కియా జనరల్ మేనేజర్ టీ.రత్నక్రాంతికుమార్, జనరల్ మేనేజర్ శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రామాంజనేయులు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ తారకేశ్వర్ పాల్గొన్నారు.

నాడు బెల్టు తీసేశారు

పేదల రోజువారీ సంపాదన తాగుడుకు తగలేస్తూ ఖాళీ జేబులతో ఇంటికొస్తే కుటుంబం గడవడం సాధ్యం కాదనే విషయం తన సుదీర్ఘ పాదయాత్ర సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి మాసంలోనే బెల్టు షాపులను ఏరిపారేశారు. అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. ఈ విధానం కొనసాగిస్తే ప్రభుత్వానికి రూ.వేల కోట్లు లాభం వస్తుందని తెలిసినా సమాజంలో మార్పు కోసం మద్యం అక్రమ రవాణా, బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహించలేదు. దీనిపై కూటమి నేతలు విషప్రచారం నిర్వహించారు. తక్కువ ఖరీదుకే నాణ్యమైన మద్యం అందిస్తామని నమ్మించారు. మద్యం ప్రియుల ఓట్లు దండుకునేలా కుట్ర చేశారు. తీరా చూస్తే ఊరూరా బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. బెల్టు షాప్‌ల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు.



నేడు..

గ్రామాల్లో ఎటుచూసినా మద్యం ఏరులై పారుతోంది. వీధివీధినా బెల్టు షాపులే దర్శనమిస్తున్నాయి. వైన్ షాపుల యజమానుల అండదండలతో అధికార పార్టీ నేతలే బెల్టు షాపులను ఏర్పాటుచేసి మద్యాన్ని అడ్డగోలుగా అమ్ముతున్నారు. ×గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తా.. ఎమ్మార్పీకి మించి విక్రయించినట్లు ఎక్కడైనా తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవరి జోక్యం ఉన్నా చర్యలు తీసుకుంటాం×. అంటూ ఇటీవల అనంతపురం జిల్లాలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చినా ఆ పార్టీ నేతలే షాప్‌ల యజమానులతో కలిసి ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారు. మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

- బెల్టు షాపుల వారికి టీడీపీ నేతల అండ
- రాత్రి, పగలు తేడా లేకుండా అమ్మకాలు
- మద్యం ప్రియుల నిలువు దోపిడీ
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నా పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో బెల్ట్ దందా

కర్నూలు(రూరల్): మద్యం అమ్మకాలను అడ్డుకోవాల్సిన కూటమి సర్కారు మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతోంది. ప్రతి పల్లెలో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. కుగ్రామంలోనూ పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం దొరుకుతోంది. క్వార్టర్ మీద ఏకంగా రూ.30 అధికంగా వసూలు చేస్తున్నారు. అలాగే తెలంగాణ మద్యం అమ్మకాలు సైతం విచ్చలవిడిగా సాగుతున్నాయి. మండల కేంద్రాలే కాదు గ్రామాల్లోనూ ఏపీ, తెలంగాణ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కర్నూలు మండలానికి నాలుగు మద్యం షాపులు కేటాయించింది కూటమి సర్కార్. వెంకాయపల్లె గ్రామ సమీపాన రెండు, పంచలింగాల గ్రామంలో ఒక్కటి, సుంకేసుల డ్యాం సామీపాన మరొక వైన్ షాప్ ఏర్పాటు చేశారు. అయితే మండలంలోని 23 గ్రామ పంచాయితీలలో బెల్టు షాప్‌లు ఉండడం గమనార్హం.

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వమే మద్యం షాప్‌లను నిర్వహించేది. గ్రామాల్లో బెల్టుషాపులు మచ్చుకైనా కనపడేవి కావు. షాపులో ఒక వ్యక్తికి మూడు క్వార్టర్ సీసాల మద్యం మాత్రమే ఇచ్చేవారు. పరిమితికి మించి ఎవరైనా మద్యాన్ని తరలిస్తే అధికారులు దాడులు చేసి వారిపై చర్యలు చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రైవేటు యజమానులకు వైన్‌షాప్‌ల బాధ్యతలు అప్పగించడంతో లాభాల కోసం అడ్డగోలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. షాప్‌లలో ఇష్టమొచ్చినట్లు పరిమితి లేకుండా మద్యాన్ని అమ్మేస్తున్నారు. వైన్‌షాప్‌ల యజమానుల మద్దతుతో టీడీపీ నేతలే గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాప్‌లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. వెంకయపల్లె సమీపాన ఏర్పాటు చేసిన వైన్ షాప్‌లో అనుమతులు లేకున్నా దర్జాగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారు. నిత్యం వందల మంది అక్కడే కూర్చొని మద్యం సేవిస్తున్నా ఎక్సైజ్ అధికారులుగానీ, పోలీసులు గానీ కన్నెత్తి చూడటం లేదు. దీంతో సమీప వెంచర్లలో నివాసం ఉంటున్న మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైన్‌షాప్‌ను పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపింగ్ కాంపెక్స్‌లో నిర్వహిస్తున్నారు. దుకాణం పక్కన ఖాళీ ప్రదేశం ఉండటంతో నిర్వాహకులు మినీ బార్‌గా నిర్వహించుకుంటున్నారు. ఈ దుకాణానికి 500 మీటర్ల దూరంలోపే మసీద్, ఇంజినీరింగ్ కాలేజీ ఉన్నా ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

నాణ్యమైన మద్యం తక్కువ ధరకు అందిస్తామన్న కూటమి నేతల హామీలు నీటిమూటలయ్యాయి. నాణ్యమైన మద్యం, ధరల తగ్గింపు ఉత్తిదే అంటూ మద్యంప్రియులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. మిగతా మద్యం బ్రాండ్‌ల ధరలు తగ్గించకపోవడంతో తెలంగాణ మద్యానికి డిమాండ్ పెరిగింది. మండల పరిధిలోని దేవమాడ, పూడురు, పంచలింగాల, గొందిపర్ల, ఈ.తాండ్రపాడు, పడిదెంపాడు, నిడ్జూరు గ్రామాల వారికి తెలంగాణ రాష్ట్రం పక్కనే ఉండడంతో అలా వెళ్లి ఇలా మద్యం తీసుకొస్తున్నారు. ఉల్చాల, రేమట, ఆర్.కొంతాలపాడు, జి.సింగవరం, గార్గేయపురం, పి.రుద్రవరం, నూతనపల్లె, దిగువపాడు గ్రామాల్లో ప్రతి గ్రామంలో మూడు, నాలుగు బెల్టుషాప్‌లు ఉన్నట్లు సమాచారం. మేజర్ గ్రామ పంచాయతీ ఉల్చాలలో బెల్టు షాప్ ద్వారా రోజుకు రూ.50 వేల వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. గార్గేయపురంలో బస్టాండ్ సమీపాన ఒక పండ్ల దుకాణంలో రాత్రి, పగలు ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామ మహిళలు మొర పెట్టుకుంటున్నారు.



ఉల్చాలలో బెల్టు షాపులను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు (ఫైల్)

బెల్టు షాపుల వారికి టీడీపీ అండ



కూటమి ప్రభుత్వంలో మద్యం బెల్టు షాప్‌లు ఎక్కువయ్యాయి. మహిళా నాయకురాలుగా ఉల్చాలలో సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతను అభినందించేందుకు ముఖ్య అతిథిగా వచ్చిన నాకు గ్రామ మహిళలు గోడు వెళ్లబోసుకున్నారు. తాము కూలీనాలీ చేస్తే రోజుకు రూ.300 వస్తోందని, ఆ డబ్బును ఇంట్లోని వారు బలవంతంగా లాక్కొని మద్యం తాగి పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. బెల్టుషాపుల వారికి టీడీపీ నాయకుల అండ ఉండటంతో ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– అలివేలమ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి, కర్నూలు

పచ్చని కుటుంబాలు నాశనమవుతున్నాయి



మద్యం మహమ్మారి వల్ల పచ్చని కుటుంబాలు నాశనం అవుతున్నాయి. గ్రామాల్లో సైతం ఎళ్లవేళలా మద్యం దొరుకుతుండడంతో మందుబాబులు అతిగా మద్యం తాగి ఆరోగ్యం మీదికి తెచ్చుకుంటున్నారు. దీంతో వారి కుటుంబం రోడ్డున పడుతుంది. తాగుడుకు బానిస అయిన వారి భార్య, పిల్లలు దుర్భర జీవనం గడుపుతున్నారు. పిల్లల చదువులు పాడవుతున్నాయి.

– శ్యామలమ్మ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి

ఫిర్యాదు చేసినా చర్యల్లేవు



గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నేతలే బెల్టు షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఉల్చాల గ్రామంలో బెల్టు షాప్‌లను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినా ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు, తాలుకా అర్బన్ పోలీసులు అరికట్టలేకపోయారు. గుడి, బడికి సమీపంలో మద్యం విక్రయిస్తుండటంతో మహిళలు, విద్యార్థినులు బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటోంది.

– రాఘవేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, ఉల్చాల

పరిశుభ్రత లోపిస్తే దోమల వ్యాప్తి



నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా అధికారులు

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల్లో శుభ్రత లోపిస్తే దోమలు వ్యాప్తి చెందుతాయని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్ చెప్పారు. సోమవారం ఎర్రబురుజు పీహెచ్‌సీ పరిధిలోని వీధుల్లో ఆయన పర్యటించి ఇళ్ల పరిసరాలు, పాత్రల్లో నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసరాల్లో శుభ్రత లోపిస్తే దోమలు ప్రబలి విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఇళ్ల వద్ద తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉండటాన్ని పరిశీలించారు. ఎడిస్ దోమలు ఇంటిలోనూ, పరిసరాల్లో ఉండే చిన్న నీటి నిల్వల్లో పెరుగుతాయన్నారు. పాత వస్తువులు, పూలకుండీలు, కూలర్లు, టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, రుబ్బురోళ్లలో ఉన్న నీటి నిల్వల్లో పెరిగి డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చేస్తాయని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ, సహాయ మలేరియా అధికారి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

షబే మేరాజ్ సందడి







నగరంలోని ముస్లింలు సోమవారం షబే మేరాజ్ (బడీరాత్)ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాత్రి 9 గంటల నుంచి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ దువా చేశారు. బడేరాత్ సందర్భంగా నగరంలో సందడి నెలకొంది. వాడవాడలో వెలసిన జిలేబీ అంగళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. – సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు

మౌలిక సదుపాయాలు కల్పించండి



కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న బీడీ వర్కర్స్ కాలనీ కాలనీ వాసులు

కర్నూలు (టౌన్): జనసంచారం లేని ప్రేమనగర్ నుంచి జాతీయ రహదారి వరకు విస్తరణ ప్రతిపాదత పనులను రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుల్లా రెడ్డి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును కలిసి పలువురు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ అర్జీదారుల సమస్య ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఇవే..

- వెంకటరమణ కాలనీ రోడ్ నంబర్–4లో పశువులను పెంచుకుంటూ వ్యర్థాలనుతమ స్థలంలో వేస్తున్నారనిస్థానికులు లక్ష్మీపతియాదవ్ ఫిర్యాదు చేశారు.
- వాసవీనగర్‌లో మురుగు కాల్వలు నిర్మించాలని నజియా బేగం అనే మహిళ అభ్యర్థించారు.
- సుశ్మితా నగర్‌లో పైపులైన్‌ను తమ ఇంటివరకు పొడిగించాలని స్థానికులు హరిచంద్ర కోరారు.
- బీడీ వర్కర్స్ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని ఆవాజ్ నగర కార్యదర్శి షరీఫ్ విన్నవించారు.

ఉత్తమ బీఎల్‌ఓకు అభినందన

కర్నూలు నియోజకవర్గంలో బూత్‌స్థాయిలో అత్యుత్తమ సేవలందించి విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న 133వ పోలింగ్ కేంద్రం బీఎల్‌ఓ వినుకొండ ఈరమ్మను కమిషనర్ రవీంద్రబాబు అభినందించారు. ప్రభుత్వం అందించిన ప్రశంసాపత్రం, రూ.5 వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు.

అన్న క్యాంటీన్ తనిఖీ: అన్న క్యాంటీన్ల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. సోమవారం స్థానిక కోడుమూరు జంక్షన్ సమీపంలోని పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మూడు పూటలా పేదలకు రుచికరమైన ఆహారం అందించాలన్నారు.

30న టీకేఆర్ శర్మ శత జయంతి

కర్నూలు(అర్బన్): గాంధేయవాది, మాజీ ఎమ్మెల్యే దివంగత టీకేఆర్ శర్మ శత జయంతి ఉత్సవాలను ఈ నెల 30వ తేదీన ఉదయం 9 గంటలకు కేవీఆర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట రామరాజు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీకేఆర్ శర్మ కుమారులు కృష్ణమూర్తి, మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

నేడు మైనార్టీ సలహాదారు రాక

కర్నూలు(సెంట్రల్): అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు మహ్మద్ షరీఫ్ రానున్నారు. వర్సిటీలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

కర్నూలు (టౌన్): వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ఎస్ఎల్ఎఫ్ గ్రూపు సభ్యురాలు వరలక్ష్మి నివసించే గుడిసె ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మెప్మా రిసోర్స్ పర్సన్ నాగమణి బాధిత కుటుంబానికి రూ.10 వేల చెక్కును అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో దళితులకు పెద్దపీట



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళితులకు పెద్ద పీట వేసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల పార్టీ పదవులు పొందిన వారితో పాటు సీనియర్ దళిత నాయకులు సోమవారం ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి దంపతులను ఘనంగా సత్కరించారు. అందుకు వారు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ దళిత నాయకులను సత్కరించి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేడ్కర్ అట్టడుగు వర్గాలకు చేయాలనుకున్న సంక్షేమ కార్యక్రమాలన్నీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. దళిత వర్గానికి చెందిన సామాన్య కార్యకర్తలను కూడా ఎమ్మెల్యేలు, ఎంపీలను చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అని గుర్తు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు(అర్బన్): విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణ దేవరాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కోరారు. సోమవారం శ్రీకృష్ణ దేవరాయల 555వ జయంతి సందర్భంగా స్థానిక జీజీ హాస్పిటల్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి టీజీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయల్ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ దేవరాయల కాలం స్వర్ణయుగమన్నారు. ప్రజలకు అవసరమైన సాగు, తాగునీటి కోసం అనేక చెరువులు తవ్వించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అవి నేటికీ వాడుకలో ఉంటూ ఇప్పటి ప్రజల అవసరాలు తీర్చడంలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అలాగే దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష కీర్తిని చాటారని కొనియాడారు. ప్రజల సంక్షేమంతో పాటు కళలు, కళాకారులకు, కవులకు తగిన ప్రాధాన్యతను ఇస్తూ పాలన సాగించారన్నారు. ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన పాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అసోసియేషన్ నేతలు డాక్టర్ వై.సత్యనారాయణ, ఆర్జా రామక్రిష్ణ, కోనేటి చంద్రబాబు, చింతలపల్లి రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, మాజీ డీఎస్పీలు రామ్‌నాథ్, వెంకటేశ్వరరావు, కొట్టే చెన్నయ్య, విజయలక్ష్మి, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు రంగా జీవిత సాఫల్య పురస్కారం



రంగా జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న మలిపెద్దు నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): నగరంలోని విశ్రాంత అధ్యాపకుడు మలిపెద్దు నాగేశ్వరరావు మూడున్నర దశాబ్దాలుగా అందిస్తున్న విశిష్ట సేవలకుగాను రంగా జీవిత సాఫల్య అవార్డుకు ఎంపికయ్యారు. అభయ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమంలో ఈ పురస్కార ప్రధానోత్సవం జరిగింది. 35 ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో కొనసాగుతూనే, 25 ఏళ్లుగా ఆవోపా, చిన్మయ మిషన్, శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ సమితి, జై శ్రీరాం ఫౌండేషన్ తదితర సంస్థల ద్వారా అనేక రకాల సేవలను అందిస్తున్న నాగేశ్వరరావుకు పురస్కారం లభించడం పట్ల పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఫౌండేషన్ అధ్యక్షులు సుంకు బాలచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిన జీయర్ స్వామి, అనేక మంది పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారన్నారు. తాను జీవించి ఉన్నంత కాలం సేవే పరమావధిగా, సేవే ప్రాణంగా పనిచేస్తుంటానని తెలిపారు.

డీఈఓకు సన్మానం



డీఈఓ శామ్యూల్ పాల్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కల్లూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ విద్యాశాఖ అధికారిగా ప్రశంసలు అందుకున్న డీఈఓ శామ్యూల్‌పాల్‌ను పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధిమూర్తి, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్ సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. విద్యాపరంగా జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో అందరినీ సమన్వయం చేసుకుని ప్రత్యేక ప్రణాళికలతో ఉత్తమ ఫలితాల సాధన కోసం డీఈఓ కృషి చేస్తున్నారన్నారు. స్టాంటన్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల ఒకే బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నందున విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.పీఆర్‌టీయూ నాయకులు బాబురావు, సుబ్బారాయుడు, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను సొసైటీలకు అప్పగించాలి

కర్నూలు(సెంట్రల్): నిర్మాణాలు పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను వెంటనే సొసైటీలకు అప్పగించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీఎఫ్‌సీల నిర్మాణాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ప్రశ్నించారు. ఇప్పటివరకు 23 ఎంపీఎఫ్‌సీలు పూర్తయితే 11 మాత్రమే సొసైటీలకు అప్పగించారని, మిగతా వాటిని అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాబార్డు నిధులను వినియోగించుకొని రైతులను ఆదుకునేలా వినూత్నంగా ఆలోచన చేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు సూచించినా ప్రతిపాదనలు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు, మూడెకరాల పొలం ఉన్న రైతులకు హార్వెస్టింగ్ పరికరాలు ఇస్తే అభివృద్ధి పథంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు.టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ఎంత వరకు వచ్చిందని ఏపీఎంఐపీ పీడీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీసీఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.